నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 14 జనవరి 2025 | KARIMNAGAR

# నిర్బంధకాండ



- బీఆర్ఎస్ శ్రేణుల ముందస్తు అరెస్టులు
- మండిపడుతున్న నాయకులు

కరీంనగర్ వన్‌టౌన్ ఎదుట నాయకులను అరెస్ట్ చేసి వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

కరీంనగర్ రాంనగర్, జనవరి 13 : కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నది. సంక్రాంతి పండుగపూట నిర్బంధం కొనసాగిస్తున్నది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో సోమవారం రాత్రి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. కరీంనగర్ రాకుండా ఉండేందుకు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని వన్‌టౌన్ వద్దకు పెద్దసంఖ్యలో వచ్చిన నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి పీటీసీకి తరలించారు. రాత్రి 10.30 గంటల తర్వాత పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల గ్రంథాలయాల సంస్థ మాజీ అధ్యక్షులు ఏనుగు రవీందర్‌రెడ్డి, రఘువీర్ సింగ్‌తోపాటు పెద్దసంఖ్యలో నాయకులను అరెస్ట్ చేశారు. హుజూరాబాద్‌లో తాళ్లపల్లి శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, ఎండీ అమ్జద్‌ను వారి ఇండ్లకు వెళ్లి అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు. జగిత్యాల జిల్లాలో నాయకులు దావ సురేశ్, శీలం ప్రవీణ్, నాయకులు వొల్లెం మల్లేశం, రాజును అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఇతర నాయకులను బోయినపల్లి మండలం కొదురుపాక బ్రిడ్జి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ వెళ్లవద్దంటూ పోలీసులు నిర్బంధం విధించడంపై ఆగయ్య అసహనం వ్యక్తం చేశారు. పండుగ పూట నిర్బంధం కొనసాగించడంపై నాయకులు మండిపడుతున్నారు. సెలవు రోజుల్లో అరెస్టులు చేయడం ఏంటని? ఇండ్ల నుంచి తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని, భయభ్రాంతులకు గురి చేసేందుకే పండుగ పూట కక్షసాధింపు చర్యలకు దిగుతున్నదని ధ్వజమెత్తారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు.



జగిత్యాలలో నాయకుడు దావ సురేశ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

## రాష్ట్రంలో రౌడీల పాలన

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, జనవరి 13: తెలంగాణ రాష్ట్రంలో రౌడీల పాలన నడుస్తున్నదని, ప్రజా పాలన ముసుగులో పోలీస్ పాలన సాగుతున్నదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏపార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నాడో చెప్పుకోలేని దయనీయస్థితిలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఆయనది ఏ పార్టో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఏంటని మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిలదీసిన వైనాన్ని కొనియాడారు. రాజీనామా చేసి మళ్లీ గెలువాలని అడిగిన కౌశిక్ రెడ్డిపై మూడు కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. ప్రజా సంక్షేమంలో విఫలమైన రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు హింసాత్మక చర్యలకు తెగిస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడమేనా ఇందిరమ్మ రాజ్యమంటే అని నిలదీశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ ఆఫీస్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పైసల కోసమే పార్టీ మారిండు

- జగిత్యాల మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న దావ వసంత, పాల్గొన్న నాయకులు

జగిత్యాల, జనవరి 13 : జగిత్యాల అభివృద్ధికి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ఎలాంటి సంబంధమూ లేదని, ఆయనో షాడో కాంట్రాక్టర్ అని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. ఆయన పైసల కోసం, సొంత పనుల కోసం పార్టీ మారిండని, రాజకీయ భిక్ష పెట్టిన కవితనే వెన్నుపోటు పొడిచాడని మండిపడ్డారు. ఈ ఎమ్మెల్యే ఇంకా కార్యకర్తలకు ఏం చేస్తాడో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. కౌశిక్ రెడ్డిపై ఉద్దేశ పూర్వకంగా మూడు కేసులు పెట్టారని, ఇక ప్రజాపాలన ఎక్కడ ఉందని, ఇక్కడ నడిచేది రౌడీ పాలన అని ఎద్దేవా చేశారు. సంజయ్‌కు జగిత్యాల ప్రజల పక్షాన సవాల్ చేస్తున్నామని, మీరు రాజీనామా చేసి కాంగ్రెస్ టికెట్ గెలిచి మాట్లాడాలని చాలెంజ్ విసిరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏ పదవి లేనప్పుడే బీఆర్ఎస్‌లోకి వచ్చారని, మీ లెక్క ఇక్కడ గెలిచి పార్టీ మారలేదని, డబ్బులకు అమ్ముడు పోలేదన్నారు. మీకు మూడు సార్లు టికెట్ ఇచ్చి రెండు సార్లు గెలిపించింది బీఆర్ఎస్‌నేనని చెప్పారు. జగిత్యాల అభివృద్ధి జరిగింది అంటే అది కేసీఆర్, కవిత సహకారంతోనే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు, కవిత జైల్లో ఉన్నప్పుడు నమ్మక ద్రోహంతో పార్టీ మారిన మీకు బీఆర్ఎస్ గురించి, కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక ప్రవీణ్, ఉదయశ్రీ, పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ రావు, మల్లేశం రాజు, సాగి సత్యం రావు, పడిగెల గంగారెడ్డి, సన్నిత్ రావు, వెంకటేశ్వర రావు, చింతల గంగాధర్, టౌన్ ప్రెసిడెంట్ అనిల్, స్పందన, శ్రీధర్, వీఎం గౌడ్, మహేశ్, సాగర్, రాజేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, యూత్ నాయకులు ప్రణయ్, ప్రతాప్, సాయి శ్రీనివాస్ గౌడ్, చందు, తదితరులు పాల్గొన్నారు.



### సంబురాల సం'క్రాంతి'

సంబురాల సంక్రాంతి రానే వచ్చింది. మూడు రోజుల ముచ్చటైన వేడుక, సోమవారం భోగితో మొదలు కాగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. అనంతరం పిల్లలకు తలస్నానం చేయించి, భోగిపండ్లను పోశారు. ఉదయాన మహిళలు వాకిళ్లను రంగురంగుల ముగ్గులతో నింపి, వాటి మధ్య ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచారు. వాటిపై గరక పోసలు పెట్టి, చుట్టూ నవధాన్యాలు, పండ్లు పోశారు. సూర్యుడు దక్షిణాయణం చాలించి, ఉత్తరాయణంలోకి ప్రవేశించే రోజే మకర సంక్రాంతి కాగా, పండుగను మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు పల్లె, పట్నం సిద్ధమైంది.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కరీంనగర్



పాడి కౌశిక్‌రెడ్డిని విడిచిపెట్టాలంటూ కరీంనగర్ వన్‌టౌన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌పై ఆగ్రహజ్వాల

- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతారా..?
- పార్టీ మారిన ఎమ్మెల్యేను నిలదీస్తే అరెస్ట్ చేస్తారా..?
- మండిపడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడంపై కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఓ టీవీ స్టుడియో ఇంటర్వ్యూకు హాజరై బయటకు వచ్చిన ఆయనను నడిరోడ్డుపై అదుపులోకి తీసుకోవడంపై గులాబీ దళం భగ్గుమన్నది. బీఆర్ఎస్ నాయకులు ఆయన అరెస్ట్‌ను ఖండిస్తూనే ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ఇదొక పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ పక్కలో బల్లెంలా మారిన ఆయన గొంతును ఏదో రకంగా నొక్కాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌లో గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వేదిక వద్ద నిలదీసిందుకు.. ఆయనపై కక్షకట్టిన కాంగ్రెస్ మంత్రుల ఆదేశాల మేరకే అరెస్ట్ చేశారని విమర్శిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నిలదీస్తే కేసులు నమోదు చేస్తారా..? అని మండిపడ్డారు. అయినా ప్రశ్నించే గొంతులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని, ప్రజల వైపు నిలబడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నదని, అరెస్టులతో భయపెడుతున్నదని ధ్వజమెత్తారు.



### కొనసాగిన హైడ్రామా

కరీంనగర్ వన్‌టౌన్ ఎదుట నారదాసు లక్ష్మణ్‌రావు, రవీందర్‌సింగ్

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రిమాండ్ వ్యవహారంలో అంతా హైడ్రామా కొనసాగింది. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేసిన కరీంనగర్ పోలీసులు, రాత్రి 9.30 గంటల సమయంలో కరీంనగర్ తీసుకొచ్చారు. నేరుగా పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. తర్వాత వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తారన్న సమాచారంతో అక్కడికి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. మరోవైపు కౌశిక్‌రెడ్డి కేసులపై వాదనలు వినిపించేందుకు మాజీ మేయర్ రవీందర్‌సింగ్, నారదాసు లక్ష్మణ్ రావు వచ్చారు. కానీ, అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని త్రీటౌన్‌కు తరలించారు. నేటి ఉదయం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.



కరీంనగర్ వన్‌టౌన్ ఎదుట బీఆర్ఎస్ నాయకుడిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# ప్రశ్నిస్తే కేసులా..?

- కౌశిక్‌రెడ్డిని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?
- సంజయ్ రెచ్చగొడితేనే నిలదీశారు
- పదేళ్లు అధికారంలో ఉన్నాం.. ఎంత మందిపై కేసులు పెట్టాం
- కౌశిక్‌ను లాక్కెళ్లమని చెప్పింది మంత్రులేనా..?
- పోలీసులకు అంత అధికారం ఎక్కడిది?
- మంత్రులు ఉత్తం, పొన్నం, శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల ఫైర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యేలపై కేసులు పెట్టడం ఏమిటని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పూర్తిగా పోలీసు రాజ్యం చేస్తున్నారని విమర్శించారు. అయినా ఎలాంటి కేసులు పెట్టినా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఎందుకు టార్గెట్ చేశారని, ఆయన చేసిన తప్పేంటని ప్రశ్నించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రెచ్చగొడితేనే ఆయన నిలదీశారని, ప్రశ్నించినంత మాత్రాన సమావేశాల నుంచి లాకెళ్తారా.. కేసులు పెడతారా? అని మండిపడ్డారు. రేపు మరో ఎమ్మెల్యే మాట్లాడినా ఇదే పరిస్థితి ఉంటుందా? అని అడిగారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి తమను ఆహ్వానిస్తేనే వెళ్లామని, ఆహ్వానించి ఈ రకంగా అవమానిస్తారని అనుకోలేదని వాపోయారు. కరీంనగర్‌లోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన ఘటనను వివరించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా తమను మాట్లాడాలని కోరినప్పుడు కొత్తగా అమలు చేస్తున్న నాలుగు పథకాల్లో ఉన్న లోపాలు, అమలు చేయాల్సిన విధానాలను ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వివరించే ప్రయత్నం చేశామన్నారు. వారి నుంచి తమకు స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. ఒక ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి కూడా రైతు భరోసా, దళిత బంధుపై ప్రశ్నలు వేశారని, వీటికి కూడా సమాధానం రాలేదన్నారు. చివరికి ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య జరిగిన గొడవను కూడా మంత్రులు పట్టించుకోకపోవడం దురదృష్టకమని అన్నారు. తాము పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జీవన్‌రెడ్డి లాంటి నాయకులు తమను ఇదే విధంగా నిలదీశారని, వారికి సరైన సమాధానాలు చెప్పామే తప్ప కేసులు పెట్టామా..? అని గుర్తు చేశారు. శాసన సభలోనూ ఎంత పెద్ద గొడవ జరిగినా స్పీకర్ అనుమతి లేకుండా మార్షల్స్ ఎమ్మెల్యేలను ముట్టుకోరని, అలాంటిది ఇక్కడ కౌశిక్‌రెడ్డిని పోలీసులు దౌర్జన్యంగా లాక్కెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. వేదికపై ఉన్న మంత్రులు జోక్యం చేసుకుంటే ఇద్దరినీ కంట్రోల్ చేసే అవకాశం ఉండేదన్నారు. తాను కౌశిక్ రెడ్డిని ముట్టుకోవద్దని ఎంత చెప్పినా వినకుండా పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని, దౌర్జన్యంగా లాక్కెళ్లారని వాపోయారు. ఆయన తప్పు లేకపోవడం వల్లనే 'సీఐ గల్లా పట్టినట్టు కేసు పెట్టాలి' అని ఒక మంత్రి నిన్న చెబుతున్నట్టు తెలుస్తున్నదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేశ్, తోట రాములు, తుల బాలయ్య, నాయకులు గందె మహేశ్, సుంకిశాల సంపత్ రావు, రెడ్డవేణి మధు, పిల్లి మహేశ్, ఒంటెల సత్యనారయరణ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి ఉన్నారు.

### ఎమ్మెల్యే అని చూడకుండా లాక్కెళ్తారా..?

రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్ పక్క పక్కనే కూర్చున్నరు. కౌశిక్ రెడ్డి మాట్లాడి కూర్చున్న తర్వాత బీఆర్ఎస్ నాయకుల బట్టలు విడిపిస్తానని సంజయ్ రెచ్చగొట్టేలా మాట్లాడినట్టు కౌశిక్ నాతో చెప్పిండు. అందుకే సంజయ్ మాట్లాడే ముందు 'నీది ఏ పార్టో చెప్పి మాట్లాడాలి' అని కౌశిక్‌రెడ్డి నిలదీసిండు. ఇద్దరి మధ్య గొడవ జరిగిన మాట వాస్తవమే. అయితే వీరిద్దరినీ కంట్రోల్ చేయాల్సిన బాధ్యత మంత్రులకు లేదా? అధికారిక మీటింగ్‌లోకి పోలీసులు ఎలా వచ్చారు? ఒక ఎమ్మెల్యే అని కూడా చూడకుండా మంత్రుల కళ్లెదుటే గొర గొరా ఎలా లాక్కెళుతారు? మంత్రులే పోలీసులకు అనుమతి ఇచ్చారా..? వారి అనుమతితో లాక్కెళితే ఆ ముగ్గురు మంత్రులు కౌశిక్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలి.

- గంగుల కమలాకర్































